క్లుప్తంగా

డయేరియా నివారణపై అవగాహన



విద్యార్థులకు ఓఆర్‌ఎస్ అందిస్తున్న ఎమ్మెల్యే, మేయర్ తదితరులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నగరంలో డయేరియా కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ నూర్జహాన్ అధికారులను ఆదేశించారు. (స్టాఫ్ డయేరియా) అతిసార వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా సోమవారం ఉదయం స్థానిక 15వ డివిజన్ ఆముదాల అప్పలస్వామి కాలనీలో డయేరియా నివారణపై అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్కూళ్లలో చిన్నారులతో ఓఆర్‌ఎస్ వాటర్ తాగించారు. అనంతరం పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి, డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఎంఆర్‌డీ బలరాం, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యతోనే సమాజాభివృద్ధి



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళా విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని నమ్మి తమ కళాశాల 1953వ సంవత్సరం నుంచి స్త్రీ విద్యకు ఇతోధికంగా కృషి చేస్తోందని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ అన్నారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థినులకు సోమవారం నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో మెర్సీ ప్రసంగించారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి తమ కళాశాల కృషి చేస్తోందన్నారు. ఫిజిక్స్ విభాగాధిపతి నిర్మల జోత్స్న స్వాగత వచనాలతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధ్యాపకులు, వివిధ విభాగాధిపతులు ఎస్తర్ కళ్యాణి, సీఏ జ్యోతిర్మయి, రమ, పి.రత్న మేరీ, రజని, సుశీల, పద్మజ, జ్యోతి కుమారి, పీఎం సెలీన్, కె.శ్రీలత, ఆర్ ఇందిర మాట్లాడారు.

వైద్యులను సత్కరించుకోవడం గర్వకారణం

ఘనంగా డాక్టర్స్ డే



వైద్యుడు సత్యనారాయణను సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): వైద్యో నారాయణో హరి అని పెద్దలు అన్నట్టుగా, ప్రజలు వైద్యులను దేవుడిగా భావిస్తారని బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి అన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్, బీసీ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని వెంకట సాయి గ్యాస్ట్రో లివర్ స్పెషలిస్ట్ సీనియర్ డాక్టర్ కరి సత్యనారాయణను సోమవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజగోపాలాచారి మాట్లాడుతూ వైద్యులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బింధాస్ చంద్ర రాయి జ్ఞాపకార్థం జూలై 1న దేశవ్యాప్తంగా వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వైద్యం వ్యాపారంగా మారిన ప్రస్తుత తరుణంలో కొందరు వైద్యులు పేదలకు వైద్య సేవలను అందించడంలో తమ వృత్తి ధర్మాన్ని పాటిస్తున్నారని కొనియాడారు. అటువంటి వారిలో కరి సత్యనారాయణ ఒకరని, ఇటువంటి సీనియర్ వైద్యులను సత్కరించుకోవడం గర్వకారణంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, బీసీ సంఘం ఉపాధ్యక్షుడు బాయి వెంకటరావు, అబ్బిరెడ్డి రంగముత్యాలు, కింజంగి రాజు, కెల్లా దుర్గాప్రసాద్, రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎస్ఆర్ విఠల్ కుమార్, పామర్తి యేసురాజు, షేక్ సాయి బాజీ, కొత్తల శివకుమార్, పలువురు బీసీ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

'వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది'

ఏలూరు (టూటౌన్): వృత్తులన్నింటిలో వైద్య వృత్తికి ఉన్న పవిత్రత వేరని వైద్యులే ప్రజలకు దేవుళ్లంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. డాక్టర్స్‌డే సందర్భంగా సోమవారం ఆయన జిల్లాలోని వైద్యులందరికీ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. వైద్య వృత్తి ప్రస్తుతం కార్పొరేట్ వ్యాపారంగా మారిందని, ఈ స్థితిలో అనేక మంది డాక్టర్లు తమకు చేతనైనంత సేవ ప్రజలకు చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చాలీచాలని వేతనాలతో తమ వృత్తే దైవంగా భావించి రోగులకు సేవలందిస్తున్నారన్న కొనియాడారు. నార్మన్ బెతూన్, కొట్నీస్లు అత్యంత కష్ట కాలంలో యుద్ధ సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలందించారని, అనేక మంది ప్రజలకు వైద్యాన్ని చేరువకావడానికి విశేష సేవలందించారని గుర్తుచేశారు. కరోనా వంటి భీతావాహ సమయాల్లో ధైర్యంగా వైద్య సేవలు అందించిన వారిని మరోసారి ఆయన అభినందించారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న వైద్యులందరికీ సీపీఎం తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పెరిగిపోతున్న మందుల ధరలను అరికట్టాలని, వాటిపై జీఎస్టీ భారాన్ని తొలగించాలని ఎ.రవి డిమాండ్ చేశారు.

సర్పంచ్‌ల హక్కులను కాపాడాలి



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): గ్రామ సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు, దెందులూరు మండలం ముప్పవరం సర్పంచ్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో డీఆర్వో పుష్పమణికి వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ గ్రామానికి ప్రథమ పౌరుడని, గ్రామ పంచాయతీలో జరిగే విషయాలను ప్రథమ పౌరుడికి తెలియజేయాల్సిందేనని చట్టాలు చెబుతున్నాయని వివరించారు. సర్పంచ్‌లకు తెలియకుండా గ్రామాల్లోకి పోలీసులు ప్రవేశించటం, జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు సర్పంచ్ పదవికి భంగం కలిగిస్తూ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా సర్పంచ్ పదవిలో ఉన్న ఎస్సీ వ్యక్తులపై పెత్తనం చేస్తూ రాజ్యాంగ విలువలను నాశనం చేస్తున్నారని తెలిపారు. సర్పంచ్‌ల అధికారాలు, హక్కులకు భంగం కలిగించకుండా అధికారులకు సరైన సూచనలు ఇవ్వాలని కోరారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 40, 9వ భాగం, 11వ షెడ్యూల్‌లో పేర్కొన్నట్టు, ముఖ్యంగా 1994 పంచాయతీరాజ్ చట్టం విలువలను కాపాడాలని సంతోష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

స్టాఫ్ డయేరియాపై అవగాహన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగ

ఏలూరు (టూటౌన్): డయేరియా వంటి వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.మంగ అన్నారు. స్థానిక తంగెళ్లమూడిలోని యాదవ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రం-2లో స్టాప్ డయేరియాపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగ మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు డయేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కలుషితమైన నీరు, ఈగలు, దోమలు వాలిన ఆహారం తీసుకోవడం వల్ల వాంతులు, విరేచనాలు అవుతాయన్నారు. ఎవరైనా డయేరియాకి గురైతే వెంటనే దగ్గరలో ఉన్న యూహెచ్‌సీ లేదా పీహెచ్‌సీలో లేదా ఏఎన్ఎం, ఆశలకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులతో చేతుల శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుకన్య, శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు ఎ.తిరుపతి రావు, ఎస్ కృష్ణవేణి పాల్గొన్నారు.

మహిళలకు ఏలూరులోనే శిక్షణ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న దళితసేన నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో ఏలూరు జిల్లాలోని టైలరింగ్ విభాగంలో శిక్షణ ఇవ్వాలని ఏలూరు జిల్లా డీఆర్‌ఓ డి.పుష్పమణికి దళిత సేన విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో అనేక మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన అనేక మంది మహిళలు టైలరింగ్ విభాగంలో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఏలూరు జిల్లాలో దరఖాస్తు చేసుకున్న మహిళలకు పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడంతో సుమారు 100 నుంచి 130 కిలో మీటర్లు దూరం ప్రయాణం చేసి, ఆర్థికంగా ఇబ్బందులు పడి శిక్షణ పొందాల్సి వస్తోందని వివరించారు. ఈ నేపథ్యంలో ఏలూరులో దరఖాస్తు చేసుకున్న వారికి ఏలూరు జిల్లా ప్రధాన కేంద్రంలోనే శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత సేన రాష్ట్ర కార్యదర్శి బేతాల జయసుధ, ఏలూరు జిల్లా దళిత సేన మహిళా అధ్యక్షురాలు కప్పసువార్త, ఉపాధ్యక్షురాలు పిల్లి దుర్గ, కార్యదర్శి కృష్ణవేణి, దళిత సేన మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్తపై వేధింపుల కేసు

ఏలూరు టౌన్: ఏలూరులో భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వపరుపేటకు చెందిన శ్రీ లక్ష్మి శ్రీ చంద్రలేఖకు, నాగవెంకటసత్య గణేష్ కు 2021వ సంవత్సరంలో వివాహమైంది. వరుడు హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో హెడ్ గా పనిచేస్తున్నాడు. వివాహ సమయంలో అతనికి రూ.5 లక్షల కట్నం, ఇతర లాంఛనాలు అందజేశారు. ఇటీవల నాగవెంకట సత్యగణేష్ అతని తల్లిదండ్రులు, ఆడపడుచులు అదనపు కట్నం కావాలని వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు ఏలూరు మహిళా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయటంతో సోమవారం రాత్రి ఆమె భర్త పైనా, అత్త మామ, ఆడపడుచుల పైనా వరకట్న వేధింపలు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక వెంకన్న చెరువు సబ్ స్టేషన్ పరిధిలో కొత్త లైన్ల ఏర్పాటు నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జేపీబీ నటరాజన్ తెలిపారు. కొత్తగూడెంసెంటర్, 7 కాలవల సెంటర్, చాటపర్రు రోడ్, తూర్పు వీధి సాయిబాబా గుడి సెంటర్, తూర్పు వీధి గంగానమ్మ గుడి ఏరియా, ఫిల్‌హౌస్ పేట, మాదేపల్లి రోడ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

రైళ్లను వెంటనే పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): రైల్వే స్టేషన్లు, ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునికీకరణ పేరుతో విజయవాడ నుంచి విశాఖ పట్టణం వెళ్లే రూట్లలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. రైళ్ల రద్దుతో ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు, రాజమండ్రి, సామర్లకోట, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లేవారు బస్సులో సమయం వృథాతోపాటు, చార్జీలతో ఆర్థికంగానూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తిరుపతి నుంచి వచ్చే కాకినాడ టౌన్ ఎక్స్‌ప్రెస్ జూన్ మొదటి వారంలో, తాజాగా రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయగడ ప్యాసింజర్‌ను ఎక్స్‌ప్రెస్‌గా మార్చి స్టేషన్లు కుదించారని, తాజాగా ఆ ఎక్స్‌ప్రెస్‌నూ రద్దు చేశారని పేర్కొన్నారు. రైలును పునరుద్ధరించాలని, రైళ్లల్లో జనరల్ బోగీలు ఎక్కువగా కేటాయించాలని రవి కోరారు.

ప్రశాంతంగా పింఛన్ల పంపిణీ

ఏలూరు(మెట్రో): జిల్లా వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను అధికారులు ప్రశాంతంగా పూర్తిచేశారు. ఉదయం 10 గంటల మధ్య కాస్త సర్వర్లు మొరాయించడంతో ఇబ్బందులు పడినా రాత్రి 9 గంటలు దాటే వరకు పెన్షన్ల పంపిణీని కొనసాగించారు. ఈ ప్రక్రియలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నూజివీడులో మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి పెన్షన్ పంపిణీ ప్రక్రియలో పాల్గొన్నారు. ఏలూరు జిల్లాలో 2,68,353 లబ్ధిదారులకు రూ.182.74 కోట్లు రాగా, సోమవారం రాత్రి 8 గంటల సమయానికి 2,55,575 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు రూ.174.04 కోట్లు అందజేశారు. ఇది 95.24 శాతంగా నమోదైంది.

గ్రామాల్లో..

ఏలూరు రూరల్ : ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు రూరల్ మాదేపల్లి, శ్రీపర్రు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. పలువురు గ్రామస్తులు పారిశుధ్యంపై ఫిర్యాదు చేయగా, ఎమ్మెల్యే ఎంపీడీఓ ప్రణవి పిలిచి పారిశుధ్యం పనులు ఉధృతంగా చేయాలని సూచించారు. టీడీపీ నాయకులు పైడిపాటి శేఖర్, సైదు గోవర్ధన్, శ్రీహరి తదితరులు ఉన్నారు. చాటపర్రు, కొల్లేరు గ్రామాల్లోనూ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.

తాగునీటిని అందించండి మహాప్రభో



ఎంపీడీఓ తిరుపతిరావుకు వినతిపత్రం అందిస్తున్న వసంత్‌నగర్ కాలనీ మహిళలు

ద్వారకాతిరుమల: తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క అల్లాడుతున్నాం.. దయచేసి మాకు మంచినీటిని అందించండి మహాప్రభో అంటూ స్థానిక వసంత్‌నగర్ కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలో పలువురు మహిళలు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో తిరుపతిరావును కలసి మంచినీటి సమస్యను వివరించి, వినతి పత్రాన్ని అందజేశారు. గత 6 నెలలుగా తమకు మంచినీరు సక్రమంగా అందక, తాగునీటి కోసం ఎన్నో తిప్పలు పడుతున్నామని చెప్పారు. సుమారు 7 వందల ఇళ్లకు ఒక్కటే మంచినీటి బోరు ఉండటం, అది కూడా నీటిని సక్రమంలో అందించలేకపోవడం వల్లే సమస్య తలెత్తిందని అన్నారు. రోజురోజుకు నీటి సమస్య అధికమవుతోందని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. కాలనీలో కొత్త బోరును నిర్మించి తమకు నీటి కష్టాలను తొలగించాలని ఎంపీడీవో తిరుపతిరావును కోరారు. దాంతో వసంత్‌నగర్ కాలనీ వాసులకు వెంటనే ట్యాంకర్లతో మంచి నీటిని అందించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావుకు ఎంపీడీవో సూచించారు. నూతన బోరు నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపట్టి, నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.

టీచ్ టూల్ ద్వారా బోధనలో నూతన పద్ధతులు



టీచ్ టూల్ శిక్షణలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్స్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): టీచ్‌టూల్ ద్వారా బోధనలో నూతన పద్ధతులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నట్టు ఏలూరు ప్రాంత శిక్షణ కోఆర్డినేటర్, ఏలూరు ఎంఈఓ-2 రూపావతు రంగయ్య తెలిపారు. ఏలూరు వెన్యూలో జరిగిన టీచ్‌టూల్ శిక్షణ తొలి రోజు సోమవారం ఆయన మాట్లాడారు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సీఆర్‌పీలకు ఈ నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు టీచ్‌టూల్ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ శిక్షణ ద్వారా బోధనా పద్ధతులు ఏవిధంగా అభివృద్ధి చేసుకోవాలో అవగాహన కల్పిస్తామన్నారు. ఏలూరు జిల్లా తరుపున 19 మంది మాస్టర్ ట్రైనర్స్ రాష్ట్ర స్థాయిలో శిక్షణ తీసుకుని జిల్లాలోని 7 సెంటర్లలో, 400 మందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సాల్ట్ ఏలూరు జిల్లా ప్రతినిధి చంద్రశేఖర్ మాట్లాడుతూ టీచ్ టూల్ ప్రపంచ బ్యాంక్ ఎడ్యుకేషనిస్ట్‌చే రూపకల్పన చేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 36 మధ్య ఆసియా దేశాల్లో 12 ప్రథమ భాషల్లో ఈ టూల్‌ని అమలు చేశారని చెప్పారు. అయితే అందులో మన తెలుగు భాష ఉండటం, మొట్టమొదటి సారిగా మన దేశంలో మన ఆంధ్రప్రదేశ్‌లోనే అమలు చేయడం గమనార్హమని అన్నారు.

బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్



కొమ్మరలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ద్వారకాతిరుమల: అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎన్నో పోరాటాలు చేసిన యోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ నాయకుడు బొండాడ వెంకన్నబాబు అన్నారు. మండలంలోని కొమ్మర గ్రామంలో సోమవారం జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. అందులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేత వెంకన్నబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాంత్ర సురేష్‌బాబు, గ్రామ సర్పంచ్ మానుకొండ మణి, భీమయ్య జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ భారత తొలి దళిత ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అప్పట్లో చదువుకు దూరమై, దుర్భర జీవితాన్ని గడుపుతున్న దళిత దీనజనుల కోసం జీవితాంతం శ్రమించిన సంస్కరణల యోధుడు జగ్జీవన్‌రామ్ అని చెప్పారు. అంటరానితనానికి వ్యతిరేకంగా, సామాజిక సమానత్వానికి మద్దతుగా ఆయన ఎన్నో పోరాటాలు చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పీడిత ప్రజల గోంతుక జగ్జీవన్‌రామ్ అని, ఆయన చేసిన పోరాటాలు ఈ తరం వారికి ఆదర్శప్రాయమన్నారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు - బీహెచ్ఈఎల్	21,.15	4822	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	--
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	00
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.10	98503	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	10, 15
బెండకాయలు	24	కంద	64
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	32
కాకర కాయలు	50-60	కీరా దోస	44
బీరకాయలు	42	ఫ్రెంచ్‌బీన్స్	120
బీరకాయలు (పందిరి)	60	అల్లం	180
క్యాబేజీ	40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	32-56	పాలకూర	15
దొండకాయలు	26	తోటకూర	12
బంగాళదుంపలు	38	చుక్కకూర	15
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	60	పుదీనా	05
దోసకాయలు	22	బఠాణి	--
ఆనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	48

స్టార్ లైనర్ స్లీపర్ బస్సు ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆర్టీసీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రజలను కోరారు. ఆర్టీసీ ఏలూరు డిపో నుంచి హైదరాబాద్‌కు ప్రజల సౌకర్యార్థం తిప్పనున్న నాన్ ఏసీ స్టార్ లైనర్ స్లీపర్ బస్సును ఆయన సోమవారం ఏలూరు బస్టాండు నుంచి ప్రారంభించారు. చంటి మాట్లాడుతూ ఏలూరు డిపో రాష్ట్రంలో గుర్తింపు పొందిందని, మధ్యతరగతి ప్రయాణికులు సైతం ఆనందంగా ప్రయాణించే విధంగా నాన్ ఏసీ స్లీపర్ బస్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ ఈ బస్సులు ప్రతి రోజు రాత్రి 10.30 గంటలకు ఏలూరు నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు బీహెచ్ఈఎల్ చేరుకుంటాయని, తిరిగి బీహెచ్ఈఎల్ నుంచి రాత్రి 9.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు ఏలూరు చేరుకుంటాయని చెప్పారు. టికెట్ ధర రూ.890గా నిర్ణయించామని, అప్పర్ బెర్త్‌కు రూ.40 తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.వాణి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ జి.మురళి, పీఆర్‌ఓ కేఎల్‌వీ నరసింహం, అసిస్టెంట్ మెకానిక్ ఇంజనీర్ ప్రేమ్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీలు

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారులో దొంగలు హల్చల్ చేశారు. ఆదివారం రాత్రి వరుసగా మూడు గుడుల్లో చోరీలకు పాల్పడ్డారు. గుడి తలుపులు పగలకొట్టి హుండీల్లో సొమ్మును ఎత్తుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారు మాదేపల్లి రోడ్డులో సుంకరివారి తోటకు వెళ్లే కూడలిలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో దొంగలు పడ్డారు. గుడి తలుపులు పగలకొట్టి లోనికి చొరబడ్డారు. అక్కడ హుండీని పగలకొట్టి అందులో నగదు దోచుకున్నారు. సమీపంలో ఉన్న వెంకటేశ్వరస్వామి గుడి, పోలేరమ్మ గుడిలో కూడా చొరబడి హుండీల్లో సొమ్ము కాజేశారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై రాజారెడ్డి సోమవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ సీసీపుటేజ్లు గమనించగా దొంగ గుడి తలుపు తాళాలు పగలకొడుతున్న దృశ్యాలు కనిపించాయి. కనకదుర్గమ్మ గుడి పూజారి దేవూరి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కొయ్యలగూడెం రోటరీ క్లబ్‌కు ప్రశంసలు

కొయ్యలగూడెం: విజయవాడ కన్వెన్షన్ హాలులో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రోటరీ సత్కార కార్యక్రమంలో కొయ్యలగూడెం రోటరీ క్లబ్ శాఖ సభ్యులను సత్కరించినట్లు స్థానిక శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎ.విశ్వనాథ శర్మ, గొలిశెట్టి వాసు సోమవారం తెలిపారు. పోలియో ఫండ్‌కి కొయ్యలగూడెం రోటరీ క్లబ్ శాఖ ద్వారా లక్ష రూపాయలు అందజేయడం, క్లబ్ ద్వారా పదకొండు విభాగాలలో నిర్వహిస్తున్న సేవలకు సభలో ప్రశంసలు లభించాయని అన్నారు. సభ్యులందరికీ రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ దత్త సుబ్బారావు మెమెంటోలు సర్టిఫికెట్లను అందజేసి సత్కరించారని, దీంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ చోడిపిండి సుబ్రహ్మణ్యం, సభ్యులు మద్దు గోపి, మజ్జి సూరిబాబు, షేక్ అమీర్ బాషా, చిరువూరి సాయి, బొమ్మ దుర్గ బాబు తదితరులు పాల్గొన్నారన్నారు.

10, 11 తేదీల్లో రైతు సంఘం శిక్షణ తరగతులు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లిలో ఈనెల 10, 11 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా స్థాయి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు సంఘ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంఘం కూరగాయల షెడ్‌లో ఉదయం 10 గంటల నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని ఆయన పేర్కొన్నారు. కావున రైతు సంఘం మండల కమిటీ సభ్యులు, గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు ఈ తరగతులకు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.